క్లుప్తంగా

చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి పూర్ణిమ దేవి

పులిచెర్ల(కల్లూరు): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పాకాల జూనియర్ జడ్జి పూర్ణిమదేవి తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూముల క్రయ, విక్రయాల్లో ఒకటికి రెండుసార్లు రికార్డులను సరిచూసుకోవాలన్నారు. అదేవిధంగా బాండుపై అప్పు ఇచ్చేటప్పుడు తీసుకునేవారి స్థోమతను కూడా చూడాలన్నారు. పేదలకు ఉచిత న్యాయ సహాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖరబాబు, ఎంఈవో సిద్ధరామయ్య, సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ఎస్ఎస్ఎం సలీం, గురుస్వామి నాయుడు, చంద్రమోహన్, ప్రవీణ్ ప్రకాష్, వి.సునీల్ పాల్గొన్నారు.

అనాథ మహిళకు అంత్యక్రియలు


బస్ షెల్టర్‌లో మృతి చెందిన మహిళ

గంగవరం: మండలంలోని పొన్నమాకులపల్లి బస్ షెల్టర్‌లో శనివారం గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఆమె వారం రోజులుగా బస్ షెల్టర్‌లోనే వుంటోంది. మతిస్థిమితం లేకపోవడంతోపాటు అనారోగ్యంతో బాధపడేదని స్థానికులు తెలిపారు. శనివారం ఉదయం అపస్మారక స్థితిలో వున్నట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకునే లోపే ఆమె మృతి చెందింది. పోలీసులు చుట్టుపక్కల విచారించారు. అనాథగా గుర్తించి సమీపంలోని చెరువులో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక


విద్యార్థి జస్వంత్

గంగవరం: మండలంలోని కీలపట్లకు చెందిన మూర్తి కుమారుడు జస్వంత్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ఈ బాలుడు కీలపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించాడు. ఈ మధ్య జరిగిన కౌన్సిలింగ్‌లో ఇడుపులపాయ లోని ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడు. అతన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఎంసీఏ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా 2023–25 విద్యా సంవత్సరంలో ఎంసీఏ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

108 రకాల పుష్పాలతో చాముండేశ్వరిదేవికి అలంకరణ


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

పుంగనూరు: పట్టణంలోని తూర్పుమొగసాలలో వెలసిన చాముండేశ్వరిదేవికి జెట్టికులస్తులు శనివారం 108 రకాల పూలతో అలంకరించారు. అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలో ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని దీపాలు పెట్టి మొక్కులు చెల్లించారు.

విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందించాలి


మాట్లాడుతున్న హెచ్ఎం సుబ్రమణ్యం

సదుం: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యం పెంపొందించేందుకు టీచర్లు కృషి చేయాలని ఎంఈవో–2 దామోదర తెలిపారు. సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం క్లస్టర్ కాంప్లెక్ సమావేశం నిర్వహించారు. ఇందులో 25 ప్రాథమిక, సదుం, పాలమంద జెడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ విద్యలో పిల్లల ప్రగతి, పాఠశాలల నిర్వహణపై అవగాహన కలిగి వుండాలన్నారు. హెచ్ఎం సుబ్రమణ్యం మాట్లాడుతూ పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. నోడల్ ఆఫీసర్ నిరంజన్ కుమార్ పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూమికి జీవం

ఒకప్పుడు రైతులు సేంద్రియ ఎరువులు వాడేవారు. ఏళ్ల తరబడి పంటలు సాగుచేసినా భూమి స్వభావం మారేది కాదు. అధిక దిగుబడులు వచ్చేవి. క్రమేణా రసాయనిక ఎరువుల వినియోగం పెరిగింది. దీంతో తాత్కాలికంగా అధిక దిగుబడులను సాధించినా భూమి సత్తువను కోల్పోయింది. కొన్నేళ్లుగా ఇదే రీతిలో పంటల సాగు కొనసాగడంతో భూసారంలో మార్పులు సంభవించాయి. పంటలకు చీడపీడలు ఎక్కువగా ఆశించడంతోపాటు దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఈ క్రమంలో రైతులు మళ్లీ సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా పచ్చిరొట్ట ఎరువులు భూమిని సారవంతం చేస్తాయని పేర్కొంటున్నారు.


చౌడేపల్లె మండలంలోని నాగిరెడ్డిపల్లె వద్ద సాగుచేసిన జనుము పంట

- భూసారం పెంచుకుంటే అధిక దిగుబడి
- 50 శాతం రాయితీతో జనుము, జీలుగ విత్తనాలు
- రైతుసేవా కేంద్రాల్లో విత్తనాలు

చౌడేపల్లె: భూమి సారవంతంగా ఉండే పంట ఏదైనా దిగుబడి పెరుగుతుంది. ఈ క్రమంలో రైతులు శ్రద్ధ వహించి భుసారాన్ని పెంచుకునేందుకు అనుసరించాల్సిన విధానాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పచ్చిరొట్ట ఎరువులను సాగుచేయాలని సూచిస్తున్నారు. భూమిలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లి మొక్కలు పూతదశకు వచ్చే సమయంలో వాటిని కలియదున్ని కుళ్లేలా చేయాలని చెబుతున్నారు. తద్వారా భూమి సారవంతం కావడమే కాకుండా సేంద్రియ పదార్థాలతో మొక్కలకు కావాల్సిన అన్ని పోషకాలు అందుతాయని వెల్లడిస్తున్నారు.

పచ్చిరొట్ట విత్తనాల సాగు ఇలా

భూసారం పెంచడానికి పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద పంటలను సాగుచేయాల్సి వుంటుంది. సేద్యం చేసిన పొలంలో జీలుగలు, పిల్లిపెసర విత్తనాలైతే ఎకరాకు 12 కిలోలు, జనుము 16 కిలోలు వరకు చల్లి నీటిని పెట్టాలి. తర్వాత అవసరాన్ని బట్టి నీరు కట్టాలి. ఇవి వర్షాభావ పరిస్థితులను సైతం తట్టుకుని పెరుగుతాయి. జీలుగ, జనుము, పిల్లిపెసర సాగు వల్ల హెక్టారుకు దాదాపు 18 నుంచి 21 టన్నుల గ్రాసం దిగుబడి వస్తుంది. దీన్ని పశువులకు మేతగా కూడా వాడుకోవచ్చు. ఎరువుకోసమైతే పచ్చిరొట్ట పైర్లను పూత సమయంలో నేలలో కలియదున్నాలి. పైరు వయస్సు 50 నుంచి 60 రోజులలోపు కలియదున్ని ఒకటి రెండు వారాల తర్వాత నాట్లు వేసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందవచ్చు.

నత్రజని వాడకం తగ్గించుకోవచ్చు

ప్రస్తుతం పొలాలకు రసాయనిక ఎరువుల రూపంలో నత్రజని (యూరియా) అందిస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాల సాగుతో కృత్రిమ నత్రజని వాడకాన్ని సుమారు 20 నుంచి 30 శాతం వరకు తగ్గించవచ్చు. అంతేగాక నీరు భూమికింది పొరలకు జారిపోకుండా అడ్డుకట్ట పడుతుంది. నేలలో చౌడును తగ్గించడానికి సహాయకారిగా మారుతుంది.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ



పచ్చిరొట్ట ఎరువుల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అంతేగాక సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. జనుము 10 కేజీల బస్తాపై 50 శాతం రాయితీ ధరతో రూ.545, జీలుగ 10 కేజీల బస్తా రూ.615 చొప్పున విక్రయిస్తున్నాం. అవసరమైన వారు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదుచేసుకోవాలి.

–మోహన్ కుమార్, వ్యవసాయాధికారి, చౌడేపల్లె

ఎంపీపై అక్రమ కేసులు దారుణం


మాట్లాడుతున్న కళ్యాణ్‌భరత్

చౌడేపల్లె: అక్రమ మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినా కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్ ఆరోపించారు. ఆయన శనివారం చౌడేపల్లెలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఏడాదిలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. అదే క్రమంలో వైఎస్సార్ సీపీకి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ తప్పడు కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తోందని దుయ్యబట్టారు. హామీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, దీన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే సమయం దగ్గరపడిందన్నారు. సమావేశంలో నాగేంద్ర, వెంకట్‌రెడ్డి, చంగల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వినోద్‌కుమార్, గణేష్, చరణ్‌తేజ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు


సదుం సమావేశంలో మట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నేతలను వేధించడమే లక్ష్యంగా తప్పుడు కేసులు బనాయిస్తోందని, అక్రమ కేసులకు భయపడేది లేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఆయన శనివారం సదుంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీలో కీలక స్థానంలో ఉన్న రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. మదనపల్లె ఫైల్స్, మంగళంపేట అటవీ భూములు, బుగ్గమఠం భూములు అంటూ ఇబ్బందులు పెట్టాలని చూసిందన్నారు. వాటిలో ఏమీ చేయలేక ఇప్పుడు లిక్కర్ స్కామ్ అంటూ ఆధారాలు లేకుండానే అధికారులపై ఒత్తిడి తెచ్చి కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తోందన్నారు. ఒక ఎంపీ మద్యం పాలసీలో ఎలా జోక్యం చేసుకుంటారని, ఆయనకు ఇందులో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మద్యం కుంభకోణమని అంటూ మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వెంట ఉండే వారిని అరెస్టు చేసి శునాకానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ చేస్తున్న పోరాటాలకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి కూటమి పెద్దలు భయపడుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రజల్లో మరింత బలపడుతోందని, వచ్చే ఎన్నికల్లో తాము చిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఏడాదికే కూటమి ప్రభుత్వానికి అర్థమైందని విమర్శించారు. అందువల్లే వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులకు తెరలేపిందన్నారు. ఏడు కేసుల్లో బెయిల్‌పై ఉన్న చంద్రబాబు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ఎన్నో కుట్రలను ఛేదించుకుని ఈ స్థాయికి వచ్చిందని, ఎన్ని కుట్రలు పన్నితే తాము అంత బలపడతామని చెప్పారు. అధికార గర్వంతో చేస్తున్న కుట్ర రాజకీయాలకు రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు. తామంతా వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి బాటలో ప్రజా సమస్యలపై మరింతగా పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచ్‌లు హనుమంత రెడ్డి, వెంకటరమణ, ఎంపీటీసీ మల్లికార్జున, ఎస్సీ సెల్ నాయకుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం అనర్థదాయకం



పుంగనూరు శుభారాం డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, పుంగనూరులో ర్యాలీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది




పులిచెర్ల (కల్లూరు) ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, బైరెడ్డిపల్లి : తీర్థంలో ఆరోగ్యసిబ్బంది ర్యాలీ, పలమనేరు : ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపాలిటీ అధికారులు

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ఆవరణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాజశేఖర్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి

పుంగనూరు: పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శనివారం మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంపై కార్యాలయం నుంచి గోకుల్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం ఏర్పాటుచేశారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

పులిచెర్ల(కల్లూరు): ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలని కల్లూరు హైస్కూలు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. ఆమె శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలు

బైరెడ్డిపల్లె: ప్లాస్టిక్ వినియోగం వల్ల వాతావరణం కాలుష్యమవుతోందని బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల వైద్యాధికారులు అరుణ్‌కుమార్, విజయ్‌చంద్ర తెలిపారు. వారు శనివారం స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు భూమిలో కరగవని తెలిపారు. దీనివల్ల నీరు, గాలి కాలుష్యమై అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించి కాటన్ బ్యాగులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఎస్ఐ పరశురాముడు, హెల్త్ ఎడ్యుకేటర్లు కాంతమ్మ, సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల్లో ప్లాస్టిక్ విక్రయాలు నిషేధం

పలమనేరు: పట్టణంలోని దుకాణాల్లో ఇకపై ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు చేయరాదని, ఎవరైనా విక్రయిస్తున్నట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. ఆయన శనివారం మెప్మా మహిళలతో కలిసి స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుడ్డ బ్యాగులు వాడతామని ప్రతిజ్ఞ చేశారు. గడ్డూరు కాలనీలో మొక్కలు నాటారు. పట్టణంలోని వీధి విక్రయదారుల సమావేశం నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న అక్రమ దుకాణాలను తొలగించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పీ–4 సర్వేపై సమావేశం చేపట్టారు. ఇందులో నియోజకవర్గ స్పెషలాఫీసర్ శ్రీదేవి, పలువురు తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల బారులు



గ్రోమోర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు, యూరియా తీసుకెళ్తున్న రైతు

పలమనేరు: కొన్నాళ్లుగా పలమనేరులో యూరియాకు భారీ డిమాండ్ నెలకొంది. కాంప్లెక్స్ కొంటేనే యూరియా ఇస్తామంటూ ఎరువుల వ్యాపారులు మెలిక పెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యూరియాకు కృత్రిమ కొరత అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో రెండ్రోజుల క్రితం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌కు కావాల్సినంత యూరియా మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం పలమనేరులోని గ్రోమోర్ దుకాణంలో యూరియా బస్తా రూ.260 చొప్పున విక్రయాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో దుకాణం వద్దకు చేరుకున్నారు. ఇతర ఎరువుల దుకాణాల్లో యూరియా బస్తా రూ.295 నుంచి రూ.300ల వరకు విక్రయించారు. గ్రోమోర్‌లో ఎమ్మార్పీకే యూరియా అమ్మడంతో ఈ దుకాణాల్లో యూరియా కొనేవారే లేకుండా పోయారు. వారు గోడౌన్లలో యూరియాను నిల్వ ఉంచి డిమాండ్ పెరిగిన తర్వాత అధిక ధరలకు విక్రయించనున్నట్టు సమాచారం.

మురుగు కాలువలపై దుకాణాలు


మున్సిపాలిటీ ఎదురుగా ఏర్పాటుచేసిన దుకాణం

పలమనేరు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొందరు రోడ్డు పక్కనున్న స్థలాలను ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటుచేసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. మరికొంత మంది మురుగు కాలువలపై దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఆక్రమిత స్థలాల్లో వున్న దుకాణాలను తొలగించాలని కౌన్సిలర్లు పలు సమావేశాల్లో మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికార పార్టీ నేతల సిఫార్సులు వుండడంతోనే అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా తమ కార్యాలయం ముందే మురుగు కాలువలను ఆక్రమించుకుని కూరగాయల దుకాణాలు పెట్టుకున్న మాట నిజమేనన్నారు. అక్రమ దుకాణదారుల జాబితా సిద్ధం చేశామని తెలిపారు. పోలీసుల సాయంతో వాటిని తొలగిస్తామని, దీనిపై రాజకీయ ఒత్తిళ్లు ఉండబోవని స్పష్టం చేశారు.

రండి.. మీ అకౌంట్‌లో డబ్బులేస్తాం..!

- మహిళలను ఏమార్చుతున్న కూటమి నేతలు
- కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం క్యూకడుతున్న మహిళలు
- మీసేవా కేంద్రాలు, సీఎస్సీలకు కాసులు కురిపిస్తున్న వైనం
- ఇదంతా తప్పడు ప్రచారమంటున్న మెప్మా అధికారులు

సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను గాలికొదిలేసింది. ఏడాదికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుంది. ఆ పార్టీ నాయకులు ప్రజల్లోకి రావాలంటే ఎక్కడ నిలదీస్తారోనని భయపడుతున్నారు. ఈ క్రమంలో ప్రజలను ఏమార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తుందని, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులు ఇవ్వాలని చెబుతున్నారు. దీంతో మహిళలు మీసేవా కేంద్రాలు, సచివాలయాలు, ఇంటర్‌నెట్ సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. దీనిపై అధికారులు మాత్రం తప్పుడు ప్రచారమని కొట్టేస్తున్నారు.

పలమనేరు: తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు మహిళల ఖాతాలో మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.2,500 వేస్తామని ఆ ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ పథకం ఏపీలోనూ అమలుచేయనున్నట్టు కొందరు ప్రచారం చేశారు. దీన్ని నమ్మిన మహిళలు పనీపాట వదులుకుని సర్టిఫికెట్ల కోసం మీసేవా కేంద్రాలు, సచివాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన పలమనేరు పట్టణంలోని మీసేవా సెంటర్ల నిర్వాహకులు వారి నుంచి అదనంగా రుసుం వసూలు చేస్తూ సర్టిఫికెట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసి పంపుతున్నారు. అర్జీకి రూ.50, దరఖాస్తుకు రూ.200 వరకు తీసుకుంటున్నారు. ఇది ఫేక్ ప్రచారమని మీసేవా నిర్వాహకులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. డబ్బు సంపాదనే తమ ధ్యేయమన్నట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని అమాయక మహిళలకు నిజాలు చెప్పకుండా వారు అడిగిన ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు నమోదు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఏ నోట విన్నా ఈ మాటే

పలమనేరు మున్సిపాలిటీలో మెప్మాకు సంబంధించి మొత్తం 1,105 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు వున్నాయి. వాటిలో 11 వేల మందికిపైగా సభ్యులు వున్నారు. వీరు కూడా సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. ఈ నెల వ్యవధిలోనే కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో రెవెన్యూ అధికారులు సైతం విస్తుపోతున్నారు. ఈ విషయమై స్థానిక మెప్మా అధికారి బాబాను వివరణ కోరగా తమద్వారా ఇలాంటి పథకాలేమీ లేవన్నారు. ఎవరో చెప్పారని నమ్మిన మహిళలు సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఏవైనా పథకాలుంటే తామే చెబుతామని, ఇలాంటి తప్పుడు మాటలను నమ్మి అనవసరంగా సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకుని డబ్బుతోపాటు సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. దీనిపై తాము ఆర్పీల ద్వారా గ్రూపు మహిళలకు అవగాహన కల్పిస్తామన్నారు.


పలమనేరులోని ఒక మీసేవా కేంద్రం వద్ద సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేస్తున్న మహిళలు